క్లుప్తంగా

పరామర్శ



రేగిడి :జగదీశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, రాజేష్

రేగిడి: మండలంలోని పెద్దశిర్లాం పంచాయతీ మాజీ సర్పంచ్ పాలవలస జగదీశ్వర రావు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ బుధవారం పరామర్శించారు. జగదీశ్వరరావు మృతికి కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్‌మోహన్‌రావు, సర్పంచ్ లెంక రాంబాబు, కరణం శ్రీనివాసరావు, మజ్జి శ్రీనివాసరావు, కెంబూరి వెంకటేశ్వరరావు ఉన్నారు.

కొలతల ప్రకారం పని చేస్తేనే గరిష్ట వేతనం



వేతనదారుల మస్టర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం సిటీ: ఉపాధి హామీ పనులను ఆ పథకం సిబ్బంది ఇచ్చే కొలతల ప్రకారం పని చేస్తేనే ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట వేతనం అందుతుందని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వి.ఆర్.అగ్రహారం గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా వేతనదారులకు ఆయన పలు సూచనలు చేశారు. రెండు పూటలా పనులకు హాజరు కావాలని, జాబ్ కార్డులో ఎవరి పేరు ఉంటే వారే పనులకు రావాలని, ఒకరి పేరుతో వేరొకరు హాజరు కాకూడదన్నారు.

50వేల క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధం



వ్యవసాయ శాఖ జేడీ రామారావు

బొబ్బిలిరూరల్: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో రైతులకు పంపిణీ చేసేందుకు 50 వేల క్వింటాళ్ల వరి విత్తనాలను సిద్ధం చేశామని వ్యవసాయశాఖ జేడీ వి.రామారావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేక రులతో మాట్లాడారు. ఇప్పటికే 40 వేల క్వింటాళ్ల వరి విత్తనాలను రైతు సేవాకేంద్రాలకు చేరవేశామని, కావాల్సిన వారు తమ భూపత్రాలద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని రాయితీతో పొందవచ్చని సూచించారు. రాయితీపై అందించే వివిధ రకాల వ్యవసాయ యంత్రాల కోసం జిల్లాలో రైతులు దరఖాస్తు చేసుకోగా 24 యంత్రాలు మంజూరయ్యాయని చెప్పారు. రుతుపవనాలు ముందుగానే వచ్చి వర్షాలు కురుస్తున్నందున రైతులు పంటల సాగుకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.

దుకాణదారులకు ఊరట



డీఆర్‌ఎం లలిత్ బెహారాకు వినతి పత్రం అందజేస్తున్న దుకాణ దారులు

బొబ్బిలి: రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో (ఎన్‌సీ ప్లాట్ దుకాణాలు)ఉన్న దుకాణాలను వెంటనే తొలగించాలని కొద్ది రోజుల క్రితం రైల్వే అధికారులు నోటీసులు ఇచ్చారు. ఆయా ప్రాంతా ల్లో ఉన్న బొబ్బిలి మల్లంపేట, డొంకినవలస ప్రాంతాల్లోని దుకాణదారులు రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు బలగం వెంకటరావు,ఉప్పల హరిబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే,ఎంపీ, మంత్రుల లేఖలను తీసుకుని రైల్వే డీఆర్‌ఎం లలిత్ బెహారాను ఇటీవల కలిసి వాటిని అందజేశారు. తమ ఉపాధిని తొలగించే నిర్ణయం తీసుకోవద్దని కోరుతూ లేఖలు అందజేశారు. వివరాలన్నీ పరిశీలించిన లలిత్‌బెహరా మాట్లాడుతూ భవిష్యత్‌లో రైల్వే లైన్‌ల విస్తరణ సమయంలో మీరే స్వచ్ఛందంగా దుకాణాలు తొలగించాలని, అంతవరకూ దుకాణాలు కొనసాగించుకోవాలని సూచించారు.

లంచం ఇవ్వనిదే సంతకం కావడం లేదు..!

- రెవెన్యూ సిబ్బంది తీరుపై మండల పరిషత్ సభ్యులు మండిపాటు
- సమస్యలపై సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీసిన సభ్యులు



వంగర: మండలంలో రెవెన్యూ శాఖ సిబ్బందికి ముడుపులు ఇవ్వనిదే సంతకాల కావడం లేదని, గ్రామ స్థాయి నుంచి మండలస్థాయి వరకు రెవెన్యూ ఉద్యోగులందరిదీ ఇదే దారని మండల పరిషత్ సభ్యులు ఆరోపించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన సమీక్షలో ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు, శ్రీహరిపురం ఎంపీటీసీ కరణం సుదర్శనరావు ఆశాఖ సిబ్బందిపై ధ్వజమెత్తారు. భూసమస్యలను పరిష్కరించుకునేందుకు, వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల కోసం, అలాగే ప్రతీ పనికి రైతులు, ప్రజలు ఒక రేటు చెల్లించుకొని పనులు చేయించుకో వాల్సి వస్తోందని మండిపడ్డారు. రెవెన్యూ శాఖ పనితీరుపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ రెవెన్యూ వ్యవస్థను లంచాలమయంగా మార్చేసి బదిలీపై వెళ్లిపోయారని ఆరోపించారు.గ్రామాల్లో భూరీసర్వే సమస్యను



అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, వైస్ ఎంపీపీ ఉమామహేశ్వరరావు

పరిష్కరించే నాథుడే కరువయ్యాడని అన్నారు. సంగాంలో భూ రికార్డులు తప్పులు తడకగా ఉన్నాయని సర్పంచ్ గేదెల వెంకటనాయుడు సభ దృష్టి కి తీసుకువచ్చారు. పౌర సరఫరాల శాఖ డీలర్లకు సరఫరా చేస్తున్న రేషన్ బియ్యంలో ప్రతీ 50 కిలోల బస్తాకు 5 కిలోలు తరుగురావడమేంటని సీఎస్‌డీటీని ఎంపీపీ సురేష్‌ముఖర్జీ నిలదీశారు. తోటపల్లి ప్రాజెక్టు నుంచి సాగునీటి సరఫరా విషయంలో ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, సాగునీరు ఎప్పుడు విడుదల చేస్తారో చెప్పాలని ఏఈ బి.వి. రమణను వైస్ ఎంపీపీ ఉమామహేశ్వరరావు ప్రశ్నించారు. తల్లికి వందనం పూర్తి స్థాయిలో అందడం లేదని సంగాం, గీతనాపల్లి సర్పంచ్‌లు గేదెల వెంకటనాయుడు, నెయిగాపుల శివరామకృష్ణయ్య సభలో ప్రస్తావించారు. రైతులకు వరి విత్తనాలు పూర్తి స్థాయిలో, వారు కోరుకున్న రకాలు అందలేదని గీతనాపల్లి సర్పంచ్ నెయిగాపుల శివరామకృష్ణయ్య ఏఓ తట్టికోట కన్నబాబు దృష్టికి తీసుకువచ్చా రు. మద్దువలస డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ బాలికల గురుకులంలో 150 సీట్లు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీచేస్తామని ప్రిన్సిపాల్ రాధిక తెలిపారు. ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి, మండల విప్ తెంటు కుమారి, వైద్య, పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయ సాధనకు కృషి



గాంధీజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సాయిప్రశాంత్ కుమార్, తదితరులు

తెర్లాం: జాతిపిత మహాత్మా గాంధీజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాజాం రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కొత్తా సాయి ప్రశాంత్‌కుమార్ అన్నారు. రాజాంకు చెందిన కొత్తా అనంతరావు దంపతుల మనమరాలు తొండేల కోషిల పుట్టిన రోజు సందర్భంగా రాజాం గాంధీ స్మారక నిధి ఆధ్వర్యంలో మండలంలోని వెలగవలస ఉన్నత పాఠశాలలో గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని సాయి ప్రశాంత్‌కుమార్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం బంగారునాయుడు మాట్లాడుతూ గాంధీజీ కన్న కలలు సాకారం కావాలంటే అది నేటి బాలలతోనే సాధ్యమని, ప్రతీ విద్యార్థి ఆయన జీవితాన్ని తెలుసుకోవాలన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ కో–చైర్మన్ పెంకి చైతన్యకుమార్, స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సీహెచ్.రమణ, ఉపాధ్యాయులు తిరుపతిరావు, రాజు, చంద్రమౌళి, కవిత, నీలకంటేశ్వర యాదవ్, తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్యానవన పంటల సాగుపై దృష్టి సారించాలి



ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ రాంబాబు

తెర్లాం: ఉద్యానవన పంటల సాగుకు ఉపాధి హామీ పథకం ద్వారా ప్రోత్సాహం అందిస్తున్నామని, రైతులు ఈ పంటల సాగుపై దృష్టి సారించేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధి హామీ సిబ్బందిపై ఉందని ఎంపీడీఓ రేగి రాంబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, సచివాలయ వీఏఏలతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ వీలైనంత ఎక్కువ విస్తీర్ణంలో ఉద్యానవన పంటలు సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రైతులు తమ భూముల్లో ఫారం పాండ్‌ల నిర్మాణాలు చేపట్టేలా చూడాలన్నారు. మండలానికి ఇచ్చిన ఫారం పాండ్‌ల నిర్మాణ లక్ష్యాలను చేరుకోవాలని చెప్పారు. గ్రామ పంచాయతీల వారీగా ఇంతవరకు ఎంత విస్తీర్ణంలో ఉద్యానవన పంటలు సాగుచేశారు, ఎన్ని ఫారం పాండ్‌లు తవ్వారని ఫీల్డ్ అసిస్టెంట్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకం ఏపీఓ సుశీల, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాలతో సేవలు సులభతరం

– ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి శ్రీనివాస్



వ్యవసాయ యంత్రపరికరాలపై రాయితీకి సంబంధించిన నమూనా చెక్కును రైతులకు అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్,ఎమ్మెల్యే బేబినాయన

బొబ్బిలిరూరల్: గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలతో రైతులకు వ్యవసాయ సంబంధిత సేవలు సులభతరమయ్యాయని, విత్తనాలు నాటిన నాటి నుంచి పంట చేతికొచ్చేదాకా అవసరమైన సేవలు త్వరిగతిన అందుతున్నాయని రాష్ట్ర ఎంఎస్ఎంఈ,సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కొనియాడారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బేబి నాయన అధ్యక్షతన రైతులకు బుధవారం రాయితీపై యంత్ర పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రెతులకు ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహకాలు ఇస్తోందని, సబ్సిడీపై విత్తనాలు,యంత్రపరికరాలను అందిస్తోందన్నారు. రైతుల నుంచి చెరుకు రైతుల పంటను సంకిలి చక్కెర కర్మాగారం కొనుగోలు చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు.ఎమ్మెల్యే బేబినాయన మాట్లాడుతూ యాంత్రీకరణతో నేడు వ్యవసాయం సులభమైందని, ప్రభుత్వం గిట్టుబాటుధర కల్పిస్తుండడంతో లాభదాయకంగా మారిందన్నారు. అనంతరం రైతులకు యంత్రపరికాల సరఫరాకు సంబంధించిన నమూనా చెక్కును అందజేశారు.బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు, ఎంపీపీ శంబంగి లక్ష్మి, జెడ్పీ టీసీ సభ్యురాలు శాంతికుమారి, వ్యవసాయ శాఖ జేడీ వి.పి.రామారావు, ఏడీఏ శ్యామ్‌సుందర్, తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి నిరవధిక సమ్మె



కమిషనర్ రామప్పలనాయుడుకు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

రాజాం సిటీ: ఈనెల 22వ తేదీ అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మె చేయనున్నామని స్థానిక మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు హరిబాబు, అనిల్ తెలిపారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడుకు బుధవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గత 43 రోజులుగా వివిధ రూపాల్లో నిరసన తెలిపినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమని అన్నారు. చర్చల పేరుతో కాలయాపన చేయడమే కాకుండా, సంఘాన్ని విచ్ఛిన్నం చేయాలని చూడడం సరి కాదని అన్నారు. సమ్మె కారణంగా మున్సిపాలిటీలో ప్రజలు ఎటువంటి ఇబ్బందు లు పడినా ప్రభుత్వానిదే బాధ్యతని, ప్రజలు తమ పోరాటానికి మద్దతివ్వాలని కోరారు. కార్మికుల సంఘం గౌరవాధ్యక్షులు సీహెచ్.రామ్మూర్తినాయుడు, సభ్యులు మరియదాస్, కృష్ణ, శారద, ప్రసన్నలక్ష్మి, గణపతి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలు చేసేశామనడం శుద్ధ అబద్ధం



మువ్వల శ్రీనివాసరావు

బొబ్బిలి: ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నీ దాదాపుగా అమలు చేసేశామని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పడం శుద్ధ అబద్ధమ ని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మువ్వల శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీకి చెందిన కొందరు మొత్తం ఎన్నికల అమలు చేశామంటుంటే మరికొందరు 85 శాతం అమలు చేశామని చెబుతుండడం సరికాదన్నారు. కేవలం పెన్షన్‌లు, ఉచి త గ్యాస్ పథకం తప్ప మరేమీ అమలు కాలేదన్నారు. ప్రస్తుతం తల్లికి వందనం కార్యక్రమం అమలవుతోందనీ, ఇంకా చాలా మంది తమకు పథకం వర్తించలేదని చెబుతున్నారన్నారు. మహిళలకు ఇచ్చిన హామీల్లో ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసినట్టేనా అని ప్రశ్నించారు. అలాగే ఆడబిడ్డ నిధి ఎవరికి వేశారో చంద్రబాబు అండ్‌కో చెప్పా లని నిలదీశారు. నిరుద్యోగ భృతి ఎవరికి ఇచ్చారని ప్రశ్నించారు. అలాగే అన్నదాత సుఖీభవ పథకం నిధు లు ఏరైతుల అకౌంట్లలో వేశారో వారికే తెలియాలన్నారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారికి 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామన్నారని, మరెక్కడెక్కడ ఎవరె వరికి పింఛన్ ఇచ్చారో చంద్రబాబే ప్రకటిస్తేసరిపోతుందన్నారు. వెంటనే సూపర్ సిక్స్‌తో పాటు ఇతర హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

30వ తేదీ వరకు ప్రత్యేక గ్రామసభలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

బాడంగి: ప్రధానమంత్రి ధర్తి ఆబ జన్ భగిదరి గ్రామ ఉత్కర్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలో ఎస్టీలు ఉన్న గ్రామాల్లో ఈనెల 30వ తేదీ వరకు ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలోని ఆకులకట్ట, బొత్సవానివలస, పినపెంకి ,వాడాడ గ్రామాల్లో గదబకులస్తుల(ఎస్టీ)తో ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించాలని ఆదేశించారు. ఆధార్, రేషన్ కార్డులు, కులధ్రువీకరణ పత్రాలు, జన్‌ధన్ ఖాతాలు, గ్యాస్ కనెక్షన్లు కావాల్సిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని చెప్పారు. పీఎంజేఏవై, పీఎంకిసాన్, పీఎంవిశ్వకర్మ పథకాలు వర్తిస్తున్నదీ లేనిదీ, ఐసీడీఎస్ ద్వారా బాలింతలు,గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం, వైద్య అందుతున్నదీ లేనిది తెలుసుకోవాలన్నారు.

మెనూ పాటించాలి



రేగిడి: రేగిడి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ ఎరకయ్య

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి ప్రభుత్వం సూచించిన మెనూను పథకం నిర్వా హకులు తప్పక పాటించాలని ఎంఈఓ–2 బి.ఎరకయ్య అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాల ను బుధవారం పరిశీలించారు. వంటకాలను రుచి చూసి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచి,శుచికర భోజనం అందించాల ని చెప్పారు. అనంతరం విద్యార్థుల హాజరు పరిశీలించారు. ఎంఈఓ వెంట హెచ్‌ఎం స్రవంతి ఉన్నారు.

మోడల్ ప్రైమరీ స్కూల్‌లో తనిఖీలు

తెర్లాం: స్థానిక మోడల్ ప్రైమరీ స్కూల్‌లో ఎంఈఓ త్రినాథరావు బుధవారం తనిఖీలు చేశారు. పాఠశాల తెరిచిన సమయానికి ఆయన చేరుకుని విద్యార్థులతో కలిసి ప్రార్థన చేశారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, ఇతర రికార్డులు, మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన సరుకుల నిల్వలను పరిశీలించారు. విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమయ్యేలా బోధించాలని, మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు జరిగేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు.

మత్తు పదార్థాల జోలికిపోవద్దు



మాట్లాడుతున్న సీఐ చిన్నం నాయుడు

బొబ్బిలి: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల జోలికి పోయి జీవితాల ను నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు సూచించారు. మత్తుపదార్థాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలతో పట్టుబడితే కఠిన శిక్షలుంటాయన్నారు. అలాగే వాటిని వినియోగించడం ద్వారా ఆరోగ్యం పాడవుతుందని, విచక్షణ కోల్పోతారని చెప్పారు. వాటికి బానిసగా మారితే భవిష్యత్ చీకటిమయమవుతుందని అన్నారు. ప్రిన్సిపాల్ శ్రీధర్, అధ్యాపకులు యుగంధర్,రాజు, రాములప్పడు, శివకాంత్,త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

తాగుబోతు లైన్‌మన్ మాకొద్దు

- పాతరేగలో ఉపాధి పనులు కల్పించండి మహాప్రభో
- రామభద్రపురంలోని పలు వీధుల్లో మూడు నెలలుగా వీధి లైట్లు వెలగడం లేదు
- అధికారుల తీరుపై మండల సర్వసభ్య సమావేశంలో టీడీపీ సభ్యుల ఆగ్రహం



వీధి లైట్లు ఎందుకు వేయడంలేదని ఈఓ శ్రీనివాస్‌ను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ చంద్రరావు

రామభద్రపురం: తాగుబోతు లైన్‌మన్ మాకొద్దు... అర్జెంటుగా మార్చేయండి అంటూ విద్యుత్ శాఖ ఏఈ ఎస్.సత్యనారాయణపై రొంపల్లి ఎంపీటీసీ సభ్యుడు బవిరెడ్డి శంకరరావు ధ్వజ మెత్తారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనం లో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు శాఖ ల వారీగా నివేదికలు చదివి వినిపించారు. విద్యుత్ శాఖ ఏఈ నివేదికలు చదువుతుండగా.. రొంపల్లి గ్రామ ఎంపీటీసీ శంకరరావు అడ్డుతగిలారు. తమ గ్రామంలోని పొలాల్లో మే నెలలో విద్యుత్ తీగలు తెగి వేలాడుతున్నాయని, అటువైపుగా వెళ్లే మేకలు,ఆవులు మూగ జీవాలు చనిపోతున్నాయన్నారు. ఎన్నిసార్లు చెప్పినా లైన్‌మన్ పట్టించుకోవడం లేదని, తాగేసి సచివాల యాల్లో, ఎక్కడో పడుకుంటున్నాడని ఆరోపించారు. విద్యుత్ సమస్యలు పరిష్కరించడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.విద్యుత్ శాఖ ఏఈ మాట్లాడుతున్న సమయంలోనే పలుమార్లు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో.. ఇదిగోండి ఏఈ గారు విద్యుత్ సరఫరా ఇలానే ఉంటోందని పలువురు సభ్యులు మండిపడ్డారు. ఉపాధి హామీ ఏపీఓ త్రినాథరావు తన శాఖ నివేదికలు వెల్లడిస్తుండగా.. పాతరేగ గ్రామంలో ఈ ఏడాదంతా ఉపాధిహామీ పనులు కల్పించకపోవడంతో ఆ గ్రామస్తులు ఉపాధి లేక వలస వెళ్లిపోతున్నారని,ఉపాధిహామీ పనులు కల్పిం చండి మహాప్రభో అని మామిడివలసకు చెందిన టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు మడక తిరుపతిరావుతో పాటు పాతరేగ ఎంపీటీసీ సభ్యుడు పెద్దింటి రామినాయుడు ఏపీఓనే అడిగారు. మండల కేంద్రంలోని కనిమెరక వీధి,అగురువీధి తదితర వీధుల్లో మూడు నెలలుగా వీధి లైట్లు వెలగడం లేదు, ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోకపోవడానికి కారణమేంటని రామభద్రపురం –3 టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు బవిరెడ్డి చంద్ర మేజర్‌పంచాయతీ ఈఓ శ్రీనివాస్‌ను నిలదీశారు. లైట్లు వేయలేమంటే చెప్పండి తామే సొంత డబ్బులతో వేసుకుంటామని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆర్ అండ్‌బీ ఏఈ ప్రణయ మాట్లాడు తుండగా ఎంపీటీసీ తిరుపతినాయుడు లేచి రామభద్రపురం బొబ్బిలి మధ్యలో రోడ్డు పూర్తిగా పాడైందని, వెంటనే మరమరమ్మతులు చేయించాలని కోరారు. ఉపతహసీల్దార్ గిరిదర్‌తో పాటు ఎంఈఓ తిరుమలరావు,పీఆర్ ఏఈ రమేష్,హౌసింగ్ ఏఈ వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ ఏఈ హరిబాబు,హెచ్‌ఓ మోహనకృష్ణ తదితర అధికారులు తమ తమ నివేదికలు వెల్లడించారు.ఎంపీపీ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమంతో పాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రజాప్రతినిధులు,అధికారులు దృష్టి సారించాలన్నారు.ఎంపీడీఓ రత్నం, వైస్ ఎంపీపీలు బెల్లాన ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీలు



రాజాం సిటీ: విజేతలతో నిర్వాహకులు

రాజాం సిటీ: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వికాసతరంగిణి కార్యాలయంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు బుధవారం యోగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గొర్లె జయకృష్ణ (సన్ స్కూల్), ఖండాపు భరత్, లావేటి పురుషోత్తమ్ (విద్యానికేతన్) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు వికాసతరంగిణి రాజాం శాఖ అధ్యక్షుడు వాకచర్ల పైడిరాజు బహుమతులు అందజేశారు. అలాగే విద్యార్థి గౌట్టాపు షణ్ముఖరావు కన్సోలేషన్ బహుమతి అందుకున్నాడు. ఇప్పిలి శ్రీనివాసరావు, పాలవలస రాంబాబు, మహంతి సత్యనారా యణ, అమనాన లలిత, కింతలి పద్మశ్రీ, ఎం.మాధవి, ప్రసన్నలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రేగిడి: ఖండ్యాం ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో యోగా చేయిస్తున్న వైద్యాధికారి సునీల్‌కుమార్

బాల్యం నుంచే యోగా అలవాటుచేసుకోవాలి

రేగిడి: బాల్యం నుంచే యోగా సాధన అలవాటుచేసుకోవాలని ఖండ్యాం ప్రభుత్వ ఆయుష్ ఆస్పత్రి వైద్యాధికారి సునీల్ కుమార్ అన్నారు.ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖండ్యాం ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు యోగాసనాలపై బుధవారం శిక్షణ ఇచ్చారు. హెచ్‌ఎం బి.నాగభూషణదొర, పంచాయతీ కార్యదర్శి టి.పోలినాయుడు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ఆక్రమణల చెరలో చెరువులు

బాడంగి: కోడూరు రెవెన్యూ పరిధిలోని కంసాల బంద, నంబోడు చెరువులను ఆక్రమణదారుల చెర నుంచి కాపాడాలని సీపీఎం మండల కార్యదర్శి ఏ.సురేష్ రెవెన్యూ అధికారులను కోరారు. చెరువుల ఆక్రమణలపై రైతులు, సీపీఎం నాయకులు ఇటీవల తహసీల్దార్ సుధాకర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ ఆదేశాలతో ఎంఆర్‌ఐ జగదాంబ, సర్వేయర్ వెంకటరమణ, వీఆర్‌ఓ ఆ చెరువులను బుధవారం పరిశీలించారు. సీపీఎం మండల కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ గతంలో ఈ రెండు చెరువుల చుట్టూ భూములను కొనుగోలు చేసిన వారు చెరువులను ఆక్రమించడంతో గ్రామస్తులతో కలిసి ఫిర్యాదు చేయగా అప్పటిలో ఆక్రమణలు తొలగించారని రెవెన్యూ సిబ్బందికి వివరించారు. మళ్లీ ఇప్పుడు ఆక్రమణలకు పాల్పడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆక్రమణలను అడ్డుకుంటామని రెవెన్యూ సిబ్బంది ఆయనకు చెప్పడంతో సంతోషం వక్యం చేశారు.

విద్యార్థులందరి వివరాలు యూడైస్‌లో చేర్చాలి



మాట్లాడుతున్న ఆర్‌ఐఓ తవిటినాయుడు

రాజాం సిటీ: విద్యార్థులందరి వివరాలు యూడైస్‌లో చేర్చాలని ఆర్‌ఐఓ శివ్వాల తవిటినాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలలో ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాళ్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలల్లో చేరుతున్న ప్రతీ విద్యార్థి డేటా క్షుణ్ణంగా యూడైస్‌లో పొందుపర్చాలని సూచించారు. దీని ఆధారంగా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు వారికి వర్తించనున్నాయని తెలిపారు. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని అన్నారు. అలాగే ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని కళాశాలల్లో విధిగా విద్యార్థులతో యోగా చేయించాలని చెప్పారు. ముందుగానే విద్యార్థులకు యోగాపై అవగాహన పెంపొందించాలని తెలిపారు.